క్లుప్తంగా

డివైడర్ నిర్మాణ పనులు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారి మార్గంలో సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులు ఆదివారం నుంచి ప్రారంభించారు. నియోజకవర్గ కేంద్రంలోని జంగారెడ్డిగూడెం మార్గంలో కాకతీయ గేట్ నుంచి రింగ్ రోడ్ సెంటర్, ఖమ్మం మార్గంలో పేరాయిగూడెం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు జాతీయ రహదారి వెంట డివైడర్‌ల నిర్మాణానికి నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, డివైడర్‌ల నిర్మాణాల పనులు మొదలు పెట్టారు. రహదారి మధ్యలో డివైడర్‌ను 1.10 మీటర్ల వెడల్పు, 1.2 మీటర్లు ఎత్తు సైజుల్లో నిర్మిస్తున్నట్లు స్థానిక రోడ్లు భవనాల శాఖ అధికారులు తెలిపారు.

12న ఫిజియోథెరపీ శిబిరం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని జోయల్ ఫిజియోథెరపీ సెంటర్‌లో ఈ నెల 12న ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కనకరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ అనుభవం కలిగిన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని ఈ శిబిరంలో పలు నూతన వైద్య విధానాలపై ఉచితంగా అవగాహన కల్పిస్తారన్నారు. అన్ని రకాల శారీరక బాధలు, నొప్పులు, ఎముకలు, కీళ్ల, కండరాల నొప్పులకు పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్త్రీలకు ప్రత్యేకంగా లేడీ థెరపిస్ట్ కూడా అందుబాటులో ఉంటారని ఆయన వెల్లడించారు. శిబిరానికి హాజరయే వారు 88865 32064 నంబర్‌లో సంప్రదించలని ఆయన కోరారు.

ఆర్థిక సాయం

గుండాల: ప్రమాదవశాత్తు మృతి చెందిన కాలం వెంకన్న కుటుంబానికి ఆదివారం పలువురు ఆర్థిక సాయం అందించారు. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు కాలం వెంకన్న ఇటీవల కాలంలో చెట్టు నరుకుతుండగా మీద పడి మృతి చెందిన సంఘటన విదితమే. కాగా ఆదివారం మృతుడికి దశదిన కర్మలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతని కుటుంబానికి ఎంపీపీ మంజు భార్గవి రూ.10వేలు, బీఆర్‌ఎస్ పార్టీ సహాయ కార్యదర్శి ఎండి.ఖయ్యూం రూ.7500, సయ్యద్ ఖాలీద్ రూ.7500లు, రామంజిగూడెం సర్పంచ్ పూనెం నిర్మల రూ.3వేలు, కీసర కిరణ్ రూ.2వేలు, కందె వెంకన్న రూ. వెయ్యి, మద్దెల వెంకటేశ్వర్లు రూ.వెయ్యి, బొమ్మెర బాబూరావు రూ. వెయ్యి, తెలం శ్రీనివాస్ రూ. 500., ఓ పత్రిక విలేకరి మహమ్మద్ ఫయీం రూ.4వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. కానిస్టేబుల్ ఎం. శ్రీనివాస్ 50 కేజీల బియ్యం, కరకపల్లి సతీష్ సమాధి ఖర్చుల నిమిత్తం రూ. 11500లు అందించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుపేదలకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తూ.. ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఏజే రమేష్, కొడిశాల రాములు, నెల్లూరి నాగేశ్వరరావు, యు.నర్సింహారావు, ఎస్.సాంబశివరావు, ముల్కల ఉత్తం, నరసింహారావు, రాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధాన సాధనకు తలపెట్టిన 33 జిల్లాల సంకల్ప రథయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ.. టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ముద్రించిన గోడపత్రికలను ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాజశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగునాయక్, మండల అధ్యక్షుడు మాలోత్ భద్రు, నాయకులు వి.కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్, సుధాకర్, రాజా, సురేష్, విష్ణు, బాలు,శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో గల బాలవెలుగు పాఠశాలలో లయన్ కముజు చంద్రమోహన్ జన్మదిన వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు సీఐ ముత్యం రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే లయన్ 320ఈ డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరి క్విజ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి సాధించిన క్లబ్ కార్యదర్శి మీరాహుస్సేన్‌కు గోల్డెన్ పికాక్ అవార్డ్ పిన్‌ను సీఐ చేతుల మీదుగా బహూకరించారు. విద్యార్థులకు మధ్నాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్ రావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిసెట్టి హరిబాబు, ధానధర్మట్రస్ట్ చైర్మన్ గంట రాధ, క్లబ్ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, గాజుల రమేష్, భూక్యా ప్రసాద్, ఎం.వెంకట్, ఆదిత్య, నాగేశ్వరరావు, విద్యాజ్యోతి ట్రస్ట్ కార్యదర్శి డి.రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ లేకుండానే రోడ్డు పక్కన ఏర్పాటు
- అధ్వానంగా నిర్వహణ
- భయాందోళనలో ప్రజలు



చేతికి అందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు



పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

భద్రాచలంఅర్బన్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట ఇబ్బందిగా మారింది. భద్రాచలం పట్టణంలో ప్రజల అవసరాల కోసం ప్రధాన రహదారి, కాలనీల్లోని మార్గాల గుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కానీ చుట్టూ కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. పల్లెప్రగతిలో భాగంగా భద్రాచలంలో విద్యుత్‌కు సంబంధించిన పనులు పూర్తి చేయలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, వీటిలో అధిక శాతం పనులు పూర్తి కాగా, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద భాగంలో ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భద్రాచలం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు ఏడు వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మనుషులు సంచరించని చోట్ల అయితే ఫరవాలేదు కానీ జనాలు ఎక్కువగా తిరిగే చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ రహితంగా ఉన్నాయి. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్ల పక్క నుంచి తొలగించాలని, అది అమలు చేయడంలో ఆలస్యం అయితే వెంటనే కనీసం వాటికి రక్షణ గోడలైనా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజనీర్, డివిజన్ స్థాయిలో డివిజనల్ ఇంజనీర్, మండల, ఫీడర్ల స్థాయిల్లో ఆయా ఏఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు స్పందించాల్సి ఉంది.

ఫ్యూజ్ బాక్సులు సైతం..

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న స్తంభాలకు ఫ్యూజ్ బాక్సులు, మరికొన్ని చోట్ల మీటర్లను ఏర్పాటు చేశారు. కాగా ఈ ఫ్యూజ్ బాక్సుల నిర్వహణ కూడా లోపభూయిష్టంగా తయారైంది. వీటి మూతలు నిరంతరం తెరుచుకుని ఉంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్సుల మూతలు ఎప్పుడు ఊడిపోతాయో అన్నట్లుగా తయారయ్యాయి. అందులోంచి వేలాడుతూ బయటకు వచ్చిన విద్యుత్ తీగలు కూడా ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి, వాటికి కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిష్కారానికి కృషి చేస్తాం..



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో ప్రజలు విద్యుత్ పనులు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా సమస్య ఉంటే స్థానికి అధికారులకు సమాచారం ఇవ్వాలి. పట్టణంలో ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పరికరాలపై దృష్టి సారించాం.

– వేణు, ఏడీఈ, ఆపరేషన్, భద్రాచలం

రక్షణ కంచె ఏర్పాటు చేయాలి



మా కాలనీ ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు చుట్టూ రక్షణ కంచె లేదు. దీని కారణంగా నిత్యం ప్రమాదం పొంచి ఉంది. చిన్న పిల్లలు ఎక్కువ మంది ఈ దారిలో నిత్యం ఆటలు ఆడుకుంటూ ఉంటారు. ఏదైనా ప్రమాదం కాకముందే ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెను అధికారులు ఏర్పాటు చేయాలి.

– మారం శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ కాలనీ, భద్రాచలం

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాల కార్మికుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే రేగాను ఇటీవల నూతనంగా ఎన్నిక కాబడిన కోల్ లోడింగ్, అన్‌లోడింగ్ అండ్ లెవలింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా యూనియన్ కార్మికులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రేగాను యూనియన్ సభ్యులు, కార్మికులు పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, సింగరేణి ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు, కోల్ ట్రాన్స్‌పోర్ట్ గుమస్తా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విప్ రేగా కాంతారావు

అభివృద్ధి పనుల పరిశీలన

మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న పలు రకాల అభివృద్ధి పనులను పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం సందర్శించి పరిశీలించారు. జరుగుతున్న పనుల పురోగతి వివరాలను సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో చేపడుతూ.. త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల బతుకుల్లో వెలుగులు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల బ్రతుకుల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా గిరిజన నాయకుడు వట్టం రాంబాబు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన రైతుల పోడుభూములకు పట్టాలు పంపిణీ చేస్తూ వారి చిరకాల కోరికను తీర్చారని కొనియాడారు. పోడు పట్టాల విషయంలో స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఎంతో కృషి చేశారని తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ సకిని బాబురావు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు మండారి సతీష్, నియోజకవర్గ యూత్ కార్యదర్శి బి.రమేష్, జి.రమేష్, జాగృతి జిల్లా అధ్యక్షుడు పవన్ నాయక్, రమ, నర్సింహారావు, కృష్ణ, అనూష, విజయ్, వెంకన్న, శ్రీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవతకు బోనాలు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో ఆదివారం ముత్యాలమ్మ దేవతకు, బొడ్రాయికి బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో బోనాలు తోడ్కొని వచ్చి తొలుత బొడ్రాయి (నాభిశిల) వద్ద పూజలు చేశారు. అనంతరం దేవత వద్ద బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా పడాలని, పాడిపంటలు మంచిగా పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, రాధకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ సంప్రోక్షణ

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న 14వ శతాబ్దపు శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇటీవలే వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించాల్సిన ఆలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని వేద పండితులు విజయమారుతీ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇబ్బందులు తలెత్తకుండా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. కమిటీ తరఫున అన్నదానం చేశారు.

బీఆర్‌ఎస్‌లో సర్పంచ్ చేరిక

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్కారం గ్రామ పంచాయతీ సర్పంచ్ రూప్‌సింగ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాగా.. ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని గుత్తవారిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్‌తో పాటుగా మరి కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, బీఆర్‌ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, గుత్తా రాజా, అంకత మహేశ్వరరావు, జలగం వాసు, సత్యనారాయణ, వెంకమ్మ, జేమ్స్, అబ్దుల్ జిన్నా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులుగా సర్పంచ్, ఉపసర్పంచ్



పంచాయతీ ట్రాక్టర్‌తో చెత్త సేకరిస్తున్న సర్పంచ్ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్

అశ్వాపురం: పంచాయతీ కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తుండటంతో గ్రామంలో వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోయి పారిశుద్ధ్యం లోపించింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అశ్వాపురం మండలం మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, వార్డు సభ్యుడు చల్లమల్ల శివ ఆదివారం పారిశుద్ధ్య కార్మికులుగా పని చేశారు. పంచాయతీ ట్రాక్టర్‌తో వీధుల్లో తిరిగి తడి చెత్త, పొడి చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించారు. స్థానికులు వారిని ప్రశంసిస్తున్నారు.

అడవిని ధ్వంసం చేయొద్దు

అశ్వారావుపేటరూరల్: సీఎం కేసీఆర్ గిరిజనులపై నమ్మకంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న పోడు పట్టాల సమస్యను పరిష్కరించి, అర్హులైన వారందరికీ పోడు పట్టాలు మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కన్నాయిగూడెం, కావడిగుండ్ల, గుమ్మడవల్లి, నందిపాడు, దిబ్బగూడెం, మొద్దులమెడ, కొత్త మామిళ్ల వారిగూడెం, తిరుమలకుంట, రెడ్డిగూడెం గిరిజన గ్రామాల్లో ఆదివారం 1,557 మంది పోడు సాగుదారులకు సంబంధించిన 5,542 ఎకరాలకు పోడు పట్టా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించిన సీఎం కేసీఆర్‌ను పోడు సాగుదారులంతా గుండెల్లో పెట్టుకోవాలని, మళ్లీ కొత్తగా అడవి జోలికి వెళ్లి ధ్వంసం చేయొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. నందిపాడు గ్రామంలో పోడు పట్టాల పంపిణీలో స్థానిక సర్పంచ్ వూకే వీరాస్వామి మాట్లాడే క్రమంలో పోడు పట్టాల సమస్య తీరడంపై కంటనీరు పెట్టుకున్నారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గొంది లక్ష్మణ్‌రావు, కంగాల భూలక్ష్మి, కొడిమి సీత, జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు బండి పుల్లారావు, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోడు పట్టా పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

సామాజిక తనిఖీ

గుండాల: మండలంలో ఇటీవల జరిగిన ఉపాధి హామీ హామీపథకంలో భాగంగా సామాజిక తనిఖీ నేడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజావేదిక సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిధుల మంజూరుపై హర్షం

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరుపై బీఆర్‌ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో కళాశాల చుట్టూ ప్రహరీకి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యేకు కళాశాల విద్యార్థులు, సిబ్బంది పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

సాయిచంద్ మరణం తీరనిలోటు

చంద్రుగొండ: ప్రముఖ గాయకుడు, గిడ్డంగి కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ హఠాన్మరణం తీరని లోటని టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు అన్నారు. సాయిచంద్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిచంద్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్కే రసూల్, నల్లమోతు వెంకటనారాయణ, గాదె లింగయ్య, సత్తి నాగేశ్వరరావు, భూపతి రమేష్, సూరా వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు రాయి రాజా, ఎంఆర్‌పీఎస్ నాయకులు నారపోగు మధు, గద్దల విజయ్ పాల్గొన్నారు.

నూతన పాఠశాల ప్రారంభోత్సవం



పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్మించిన సీఎస్‌ఐ నూతన పాఠశాల భవనాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్ములు ముఖ్య అతిథులుగా పాల్గొని పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. తాము చదివిన పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్వ విద్యార్థి ముందుకు వచ్చి తలా ఓ చెయ్యి వేసి నేటి విద్యార్థులకు అన్ని హంగులతో పాఠశాల నిర్మించి ఇవ్వడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యాలరావు, ఎంఈఓ సున్నం సమ్మయ్య, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు జానీ పాషా, కందుకూరి సత్య, గణేష్, యామన షణ్ముఖ రావు, సిరసాని దుర్గారావు, లగడపాటి రమేష్, సౌజన్య, బైరెడ్డిరాధిక, భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకంగా సామాజిక సేవలు

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో సింగరేణి కార్మికులు, మాజీ కార్మికులు చేస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. ఓసీ2 డంపర్ ఆపరేటర్‌గా పని చేసి ఇటీవలే పదవి విరమణ చేసిన వేదా శ్రీనివాసరావు-కల్యాణ లత దంపతులు మూడు క్వింటాల బియ్యం, ట్యూబ్ లైట్లను సమకూర్చగా.. ప్రభాకర్‌రావు చేతుల మీదుగా సంతోష్‌నగర్ బాలవెలుగు పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల్లోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. శ్రీనివాసరావు దంతపులను అభినందించారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదా షణ్ముఖ ఉపేంద్ర, సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, కుమారస్వామి, భరోసా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అమీనుద్దీన్, మంగీలాల్,వినయ్, పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుహాసినిదేవి, దుర్గాబాయ్, రాధ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు బియ్యం అందజేస్తున్న ప్రభాకర్‌రావు, రిటైర్డ్ ఉద్యోగులు

ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలి



పట్టణంలోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం పాదయాత్ర బృందం

భద్రాచలంఅర్బన్: రెండు రోజులపాటు సీపీఎం పార్టీ నిర్వహిస్తున్న పాదయాత్రతోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలని పోలవరం ముంపు నుంచి భద్రాచలం పట్టణాన్ని రక్షించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ముంపు కాలనీలలో సీపీఎం పట్టణ కమిటీ చేపట్టిన రెండో రోజు పాదయాత్రను పార్టీ జిల్లా కార్యదర్శి కనకయ్య ప్రారంభించారు. పాదయాత్రలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వాలు భద్రాచలం పట్ల వివక్షత చూపుతున్నాయని భద్రాచలం సొసైటీ చైర్మన్ అబ్బినేని శ్రీనివాస్ అన్నారు. పాదయాత్ర సందర్భంగా.. ముదిరాజు బజారులో జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. చెత్త డంపింగ్ యార్డును పరిశీలించిన పాదయాత్ర బృందం రామాలయానికి ఆనుకొని కరకట్టపై ఉన్న చెత్త డంపింగ్ యార్డును వెంటనే పట్టణ శివారు ప్రాంతానికి తరలించాలని, డంపింగ్ యార్డ్ నుంచి వస్తున్న వాసన, పొగ బూడిదతో రామాలయం చుట్టుపక్క ప్రజలకు తీవ్ర అస్వస్థత కలుగుతోందన్నారు. పాదయాత్రకు ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన తమ మద్దతును తెలియజేశారు. గ్రీన్ భద్రాద్రి సభ్యుడు రామరాజు తిరుమల్ రావు, కార్పెంటర్ యూనియన్ నాయకులు శ్రీనివాస చారి, బుద్ధరాజు సీను, అప్పారి రాము, మిడ్ డే మీల్స్ కమిటీ సభ్యులు పిలకా శివకుమారి, సీహెచ్ రమాదేవి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, సుశీల గ్రామ దీపికల సంఘం నాయకులు యశోద, కళావతి, శాంతినగర్ నివాసులు కొర్లపాటి రాము పోటు వెంకటేశ్వరరావులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. రెండు రోజు పాదయాత్రలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్, మచ్చా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్ కారం పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, ఎం.రేణుక, బండారు శరత్ బాబు, వైజ వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టవా?

చర్ల: పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు అనారోగ్యానికి గురైనా, అనారోగ్యానికి గురై మృతి చెందినా వారికి ఎటువంటి చెల్లింపులూ లేవని, వారి ప్రాణాలంటే లెక్క లేదా అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులు ఆదివారం చర్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు అనారోగ్యం పాలైనా మృత్యువాత పడినా ప్రభుత్వం వీరి కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణ, మండల నాయకులు శ్యామల వెంకటేశ్వర్లు గణేష్ ఆటో యూనియన్ మండల అధ్యక్షులు పామారు బాలాజీ, కేవీపీఎస్ మండల కార్యదర్శి మచ్చా రామారావు, తెలంగాణా గ్రామపంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కల్యాణ్, విజయ్, సంతోషమ్మ, ప్రేమ్‌కుమార్, కల్లూరి నర్సింహారావు, ప్రసాద్, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ మద్దతు..

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ చర్ల దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యాదర్శి ముసలి సతీష్ డిమాండ్ చేశారు. పంచాయితీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల చేస్తున్న డిమాండ్లు న్యాయబద్ధమైనవని వాటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈయన వెంట రాజ.ఏష్, సతీష్, పండు తదితరులు ఉన్నారు.



చర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జేఏసీ జిల్లా చైర్మన్ ఏజే రమేష్ డిమాండ్ చేశారు. 4వ అశ్వాపురంలో రోజుకు చేరిన పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య ప్రమాద బీమా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శివ, గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, మండలంలోని పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మెను ఆదివారం కనకయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు 26 వేల వేతనం ఇవ్వటానికి ప్రభుత్వం ఎందుకు వెనకాడుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ సంఘం నాయకులకు పూలమాలవేసి సమ్మెని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎంబీ నర్సారెడ్డి నాయకులు నేకరికట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.